పోస్టుమార్టం గది నిరుపయోగం

- గార్లలో మరమ్మతులు చేసి వదిలేసిన అధికారులు
- జిల్లా కేంద్రానికి వెళ్తూ ఇబ్బందులు పడుతున్న మృతుల కుటుంబ సభ్యులు
- కలెక్టర్ దృష్టి సారిస్తే సమస్యకు పరిష్కారం


పోస్టుమార్టం గది

గార్ల: గార్ల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)లో నూతన పోస్టుమార్టం భవనం నిర్మాణం పూర్తై నెలలు గడుస్తున్నా, సీహెచ్‌సీ వైద్యులు మాత్రం ప్రమాదవశాత్తు మృతిచెందిన మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించడం లేదు. దీంతో మృతదేహాల పోస్ట్ మార్టం కోసం నిరుపేదలు రూ.10వేల ఖర్చు పెట్టుకొని వాహనం మాట్లాడుకొని మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్తూ ఆర్థికంగా చితికిపోతున్నారు. గార్లలో 6ఏళ్ల క్రితం సకల సౌకర్యాలతో నాటి ప్రభుత్వం రూ.5కోట్లు వెచ్చించి 30పడకల ఆస్పత్రిని నిర్మించింది. కానీ ఆస్పత్రిలో పోస్ట్‌మార్టం భవనంను విస్మరించింది. దీంతో మండలంలోని వామపక్ష పార్టీల నాయకులు సీహెచ్‌సీలో పోస్ట్‌మార్టం భవనం నిర్మించాలని పలుమార్లు ఆందోళన కార్యక్రమాలు చేపట్టగా ఎట్టకేలకు సీహెచ్‌సీ ఆస్పత్రి వెనుకభాగంలో ప్రభుత్వం 3నెలల క్రితం పాత పోస్ట్‌మార్టం భవనానికి మరమ్మతులు చేపట్టి నూతన పోస్టుమార్టం భవనం నిర్మాణం చేపట్టింది. కాని పోస్టుమార్టం భవనంలో రైలు, రోడ్డు ప్రమాదాలు, పురుగుమందు తాగి ఆత్మహత్యలు చేసుకున్న మృతదేహాలకు సీహెచ్‌సీ వైద్యులు పోస్టుమార్టం నిర్వహించడంలో ఆసక్తి కనబర్చడం లేదు. మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహిస్తే సాక్ష్యం కోసం మాటిమాటికి వైద్యులు కోర్టుకు వెళ్లాల్సి వస్తుందని, మనకెందుకు రిస్క్ అని వైద్యులు తప్పించుకుంటున్నట్లు తెలిసింది. ఇప్పటికైనా కలెక్టర్, జిల్లా డీసీహెచ్‌ఎస్ వెంకటరాములు స్పందించి సకల సౌకర్యాలు ఉన్న స్థానిక సీహెచ్‌సీ ఆస్పత్రిలో మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించేలా చర్యలు చేపట్టాలని నాయకులు, మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

క్లుప్తంగా

సీఎం కప్ క్రీడల్లో విద్యార్థులకు పతకాలు



మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన సీఎం కప్ క్రీడల్లో మానుకోట మున్సిపల్ పరిధిలోని జమాండ్లపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పతకాలు సాధించారు. వీరిని హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, పీడీ పుష్పలీల, ఉపాధ్యాయులు సోమవారం అభినందించారు.

పంట పరిహారం జాబితా ఇవ్వాలి

కురవి: కొన్ని నెలల క్రితం కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం పరిహారం అందజేసిందని, పంట పరిహారం కురవి మండల జాబితాను ఇవ్వాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారికి ఆర్‌టీఐ ద్వారా దరఖాస్తు చేయనున్నట్లు కురవి వీరభద్రస్వామి ఆలయ చైర్మన్ కొర్పు రవీందర్‌రెడ్డి, గుండ్రాతిమడుగు(విలేజి) సొసైటీ చైర్మన్ గార్ల పాటి వెంకటరెడ్డి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో బండి లక్ష్మారెడ్డి, ఆలయ ధర్మకర్తలు బాలగాని శ్రీనివాస్, చిన్నం గణేష్, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు నారాయణ రాజేందర్‌కుమార్, ఎర్ర నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

ఇందిరమ్మ మోడల్ ఇంటికి శంకుస్థాపన



బయ్యారం: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా మంజూరు చేయనున్న ఇందిరమ్మ మోడల్ ఇంటికి సోమవారం ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య శంకుస్థాపన చేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అవుతాయన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ, ఎంపీడీఓ విజయలక్ష్మి, ఏఎంసీ ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, సొసైటీ చైర్మన్ మధుకర్‌రెడ్డి, సొసైటీ డైరెక్టర్లు ప్రభాకర్‌రెడ్డి, శ్రీను పాల్గొన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ

మహబూబాబాద్ రూరల్: క్రిస్మస్ పురస్కరించుకుని పట్టణంలోని సెయింట్ పాల్ (సీఎస్ఐ) చర్చిలో పేదలకు సోమవారం దుస్తులు పంపిణీ చేశారు. చర్చి ఫాదర్ ప్రతాప్ అయ్యగారి ఆధ్వర్యంలో సంఘ పెద్దలు, ఉమెన్ ఫెలోషిప్ నిర్వహణలో పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంతోష్ కుమార్, రవికుమార్, రోజలీల, మంజుల పాల్గొన్నారు. 12వ వార్డులో సంచార జాతుల బుడగ జంగాల కాలనీలో క్రిస్మస్ పండుగ నిత్యావసర వస్తువులు అందజేశారు. కార్యక్రమంలో ఆవుల సతీష్, రావిశెట్టి శేఖర్, చిరంజీవి తదితరులుపాల్గొన్నారు.

లబ్ధిదారులకు భూ పంపిణీ చేయాలి

మహబూబాబాద్: నెల్లికుదురు మండలం రామన్నగూడెం గ్రామంలో గత ప్రభుత్వ హయాంలో ఇళ్ల స్థలాలు లేని పేదల కోసం ప్రభుత్వ భూమి కొనుగోలు చేసి పట్టాలు ఇచ్చింది కానీ పంపిణీ చేయలేదని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జి.రాజన్న డిమాండ్ చేశాడు. సీపీఎం ఆధ్వర్యంలో రామన్నగూడెం లబ్ధిదారులు కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. కార్యక్రమంలో నాయకులు సైదులు, నర్సయ్య, రాములు, సోమయ్య, ప్రభాకర్ పాల్గొన్నారు.

ఆడపిల్లలను రక్షించుకుందాం..

- జిల్లా మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ అరుణ



అవగాహన కల్పిస్తున్న మహిళా సాధికారత ప్రతినిధులు

మరిపెడ రూరల్: నేటి సమాజంలో ఆడపిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాల నుంచి ఆడపిల్లలను రక్షించుకుందామని జిల్లా మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ నలమాస అరుణ అన్నారు. సోమవారం మండలంలోని గుండెపుడి జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో బేటీ బచావో బేటీ పఢావో కార్యక్రమంలో జిల్లా మహిళా సాధికార కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా అరుణ మాట్లాడుతూ.. అమ్మాయిలను కాపాడుకోవడంతోపాటు వారిని చదివించాలన్నారు. బాల్యవివాహాలు, లైంగిక వేధింపులు తదితర సమస్యల గురించి హెల్ప్‌లైన్ నంబర్లు 1098,181,100,1930 కాల్ చేస్తే ఎలాంటి సమస్య అయిన పరిష్కారం అవుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మురళీకృష్ణ, ఉపాధ్యాయులు, సాధికారిత కేంద్రం నిర్వాహకులు సంధ్యారాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

స్టేజితండా జీపీలోనే కొనసాగించాలి

మరిపెడ రూరల్: స్టేజీతండా గ్రామ పంచాయతీలోనే తమ తండా మేగ్యతండాను కొనసాగించాలని తండాకు చెందిన గిరిజన వాసులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం ఎంపీడీఓ విజయ, తహసీల్దార్ సైదులుకు వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మేగ్యతండా వాసులు మాట్లాడుతూ.. ఇప్పటికే తండాను చిన్నచిన్న గ్రామ పంచాయతీలుగా చేయడం ద్వారా నిధులు రాక వెనకబాటుకు గురవుతున్నాయన్నారు. కార్యక్రమంలో గుగులోతు రెడ్డి, భూక్య శ్రావణ్, భూక్య వీరన్న బోడ అమర్‌సింగ్ పాల్గొన్నారు.

చెడువ్యసనాలకు దూరంగా ఉండాలి

గూడూరు: మాదకద్రవ్యాలు, చెడువ్యసనాలకు దూరంగా ఉండాలని, ప్రతీ ఒక్కరు చదువుకొని ఉన్నతస్థాయికి ఎదగాలని ఎస్సై బి. గిరిధర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం మాదకద్రవ్యాల వినియోగం, వాటి వల్ల కలిగే నష్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితిలో విద్యార్థి దశ నుంచే యువకులు, యువతులు వక్రమార్గంలో వెళ్తున్న సంఘటనలు ఎన్నో వెలుగులోకి వస్తున్నాయన్నారు. ముఖ్యంగా యువత సన్మార్గంలో నడవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పరుశురాములు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ సీహెచ్ బాబు, అధ్యాకబృందం పాల్గొన్నారు.

సిద్ధాంతాలు నచ్చకనే చేరికలు


పార్టీలోకి ఆహ్వానిస్తున్న అశోక్

నెల్లికుదురు: సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ యతేంద్ర కుమార్ వర్గం సిద్ధాంతాలు నచ్చకనే సీపీఐ (ఎంఎల్) న్యూడెమక్రసీ పెద్ద చంద్రన్న వర్గంలో భారీగా చేరికలు జరిగినట్లు సీపీఐ (ఎంఎల్) న్యూడెమక్రసీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి అశోక్ అన్నారు. మండలంలోని రామన్నగూడెం గ్రామంలో సోమవారం నిర్వహించిన చేరికల కార్యక్రమంలో ఆయన యతేంద్ర వర్గానికి రాజీనామా చేసి పెద్ద చంద్రన్న వర్గంలో చేరిన జిల్లా, డివిజన్, మండల, గ్రామస్థాయి నాయకులకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీలో చేరిన వారు జిల్లా నాయకుడు ఆలకుంట్ల సాయన్న, డివిజన్ నాయకుడు జాటోతు భిక్షపతి, పీఓడబ్ల్యూ జిల్లా ఉపాధ్యక్షురాలు దుర్గక్క, నాయకులు యాకూబ్, ఈరన్న, మైబు, హనుమ, సాయిలు, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

కుంటలో పడి కాడెడ్లు మృత్యువాత


మృతి చెందిన కాడెడ్లను చూస్తున్న గ్రామస్తులు

కురవి: మండలంలోని కందికొండ గ్రామ శివారులోని నాగులకుంటలో మంచినీళ్లు తాగేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు కుంటలో పడిపోయి రెండు పశువులు మృత్యువాతకు గురైన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. కందికొండ గ్రామానికి చెందిన తొడుసు వీరన్న అనే రైతు తన కాడెడ్లను నీళ్లు తాగించడానికి కుంట వద్దకు తీసుకెళ్లాడు. నీళ్లు తాగే క్రమంలో ప్రమాదవశాత్తు కుంటలో పడిపోయాయి. బయటకు రాలేక అందులోనే మృత్యువాతకు గురయ్యాయి. హైవే రోడ్డు పనుల కోసం కుంటలోని మట్టిని తీయడం వల్లనే లోతు ఎక్కువై అందులో పడి మృతి చెందాయని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశాడు. వీటి విలువ రూ.2లక్షలు ఉంటుందని రైతు రోదిస్తూ తెలిపాడు. ఈవిషయమై సీపీఎం నాయకులు జాతీయ రహదారిపై ఆందోళన చేశారు.

నిర్లక్ష్యంగా వైద్యం చేశారంటూ ఆందోళన


ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న బంధువులు

నెహ్రూసెంటర్: వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే ఆరోగ్య పరిస్థితి విషమించిందని ఆరోపిస్తూ జిల్లా కేంద్రంలోని పానుగోటి ఆస్పత్రి ఎదుట చికిత్స పొందిన బంధువుల ఆందోళనకు దిగిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లాలోని కేసముద్రం మండలం బేరువాడ మంచ్యాతండాకు చెందిన బోడ గణేష్ (20) గడ్డిమందు తాగడంతో సోమవారం ఉదయం పానుగోటి ఆస్పత్రికి తీసుకువచ్చారు. చికిత్స ప్రారంభించిన కొద్దిసేపటికి మెరుగైన చికిత్స కోసం మరో ఆస్పత్రికి తరలించాలని వైద్యులు చెప్పడంతో వరంగల్‌కు తరలించారు. ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్య చికిత్స కారణంగానే పరిస్థితి చేదాటిపోయిందని బంధువులు తెలుపుతూ ఆందోళనకు దిగారు. పోలీసులు చేరుకుని ఆస్పత్రి యాజమాన్యం, వైద్యుడు, బాధితుడి బంధువులను పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఆస్పత్రి వైద్యుడిని వివరణ కోరగా సరైన వైద్యమే అందించాం. ఎలాంటి నిర్లక్ష్యం గానీ, తప్పుడు వైద్యం చేయలేదని తెలిపారు.

పాఠశాలల్లో సెమీ క్రిస్మస్ వేడుకలు


డోర్నకల్: సెయింట్ ఆగ్నేస్ పాఠశాలలో క్రిస్మస్ వేడుకల్లో చిన్నారులు


దంతాలపల్లి: వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు


గార్ల: నిర్మలా హైస్కూల్‌లో..

సెమీ క్రిస్మస్ వేడుకలు సోమవారం పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు క్రీస్తు జననం నాటిక, నృత్యాలు ప్రదర్శించారు. విద్యార్థుల వేషధారణలు అందరిని ఆకట్టుకున్నాయి.
- డోర్నకల్/గార్ల/దంతాలపల్లి

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం


కేసముద్రంలో రైతులకు సన్మానం..

కేసముద్రం: రైతుల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పాటుపడుతుందని కేసముద్రం వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి అన్నారు. జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా సోమవారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో పలువురు రైతులను ఆయన ఘనంగా సన్మానించి, మాట్లాడారు. కార్యక్రమంలో మార్కెట్ స్పెషల్ గ్రేడ్ సెక్రటరీ అమరలింగేశ్వర్‌రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు, డైరెక్టర్లు వోలం రమేష్, చిదురాల వసంతరావు, ఎండి. అయూబ్‌ఖాన్ పాల్గొన్నారు.

మహబూబాబాద్ అర్బన్: రైతు దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని శ్రీపానిని హైస్కూల్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయులు సుమారు 10మంది ఆదర్శ రైతులను సోమవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు రషీద్, మురళీ, ప్రశాత్, స్వామి, శ్యామ్ పాల్గొన్నారు.

రైతులు నూతన విధానాలను పాటించాలి

నెల్లికుదురు: రైతులు ఎప్పటికప్పుడు నూతన విధానాలను పాటిస్తూ పంటలు సాగుచేస్తే అధిక దిగుబడి సాధించడం సాధ్యమని ఎఫర్ట్ సంస్థ ప్రతినిధి వంగాల రవీందర్ రైతులకు సూచించారు. మండలంలోని ఎర్రబెల్లిగూడెం గ్రామంలో సోమవారం జాతీయ రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో రైతులు వంగాల సంపత్, ప్రశాంత్, కృష్ణ, బాలాజి, నవీన్, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

దేశానికి వెన్నెముక అన్నదాత

తొర్రూరు: దేశానికి వెన్నెముక అన్నదాత అని లయన్స్ వినాయక ఫ్రెండ్స్ అధ్యక్షుడు పద్మం యాదగిరి అన్నారు. రైతు దినోత్సవాన్ని పురస్కరించుకుని వినాయక ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో సోమవారం డివిజన్ కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో రైతులను సత్కరించారు. కార్యక్రమంలో రామచంద్రయ్య, హీరాధర్, సోమయ్య పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

జయప్రదం చేయండి

నెహ్రూసెంటర్: ఆశకార్యకర్తలకు ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలని, పనిభ భద్రత, హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన ఆశ బస్సు జాతాను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ డిమాండ్ చేశాడు. జిల్లా కేంద్రంలో బస్సుజాతా పోస్టర్లను ఆవిష్కరించారు. ఈనెల 28న జిల్లా కేంద్రానికి చేరుకుంటుందన్నారు. కార్యక్రమంలో వడ్లకొండ ఉపేంద్ర, నిర్మల, హసీనా, గీత, కరుణ పాల్గొన్నారు.

సీఆర్టీలను రెగ్యులరైజ్ చేయాలి

మహబూబాబాద్ అర్బన్: గిరిజన ఆశ్రమ పాఠశాలలో 20ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ ఉపాధ్యాయులను రెగ్యులరైజ్ చేయాలని సీఆర్టీల, పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుగులోత్ చిట్టిబాబు డిమాండ్ చేశారు. ములుగు జిల్లా ఏటూర్ నాగరం ఐటీడీఏ కార్యాలయంలో సీఆర్టీలు తల పెట్టిన ధర్నాకు మానుకోట జిల్లా సీఆర్టీయాలు సోమవారం తరలివెళ్లారు.

విద్యార్థులు చదువుల్లో రాణించాలి

పెద్దవంగర: మండలంలోని వడ్డెకొత్తపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల్లో పదో తరగతి విద్యార్థులకు గణిత ఉపాధ్యాయుడు వెలిదే సురేష్-సంధ్యారాణి విద్యార్థులకు సోమవారం స్టడీ మెటీరియల్స్, పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ ఎఫ్‌డబ్ల్యూసీ వేలూరి శారద, ప్రతినిధి చింతల సురేష్, యాకయ్య పాల్గొన్నారు.

పీవీకి ఘన నివాళి

తొర్రూరు: మాజీ ప్రధాని పీవీ నరసింహారావు వర్ధంతి కార్యక్రమం సోమవారం డివిజన్ కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్, నాయకులు జయ్‌పాల్‌రెడ్డి, సోమయ్య, నరేందర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సమస్యలపై ఇంటింటి సర్వే

కేసముద్రం: కేసముద్రంవిలేజ్ శివారు ఎన్టీఆర్ నగర్ కాలనీలో సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం ఇంటింటి సర్వే నిర్వహించి, పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు పాపారావు, మండల కార్యదర్శి వెంకన్న, సావిత్ర, ఎల్లయ్య పాల్గొన్నారు.

దాతల స్ఫూర్తితో చదువుకోవాలి

కొత్తగూడ: దాతల స్ఫూర్తితో విద్యార్థులు చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని డీఈఓ రవీందర్‌రెడ్డి సూచించారు. మండలంలోని పోలారం కస్తూర్బా గురుకులంలో పదో తరగతి విద్యార్థులకు కాళోజీ గుడ్ ఫ్రెండ్స్ అసోసియేషన్ వారు స్టడీమెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ లక్ష్మినారాయణ, శ్రీరాములు, విజయకుమారి శ్రీనివాస్, వెంకన్న పాల్గొన్నారు.

26, 27 తేదీల్లో రాష్ట్ర సమావేశాలు

మహబూబాబాద్ అర్బన్: ఈనెల 26, 27 తేదీల్లో మానుకోట జిల్లా కురవి మండలంలో నిర్వహించనున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సమావేశాలను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనింగ్ కమిటీ గుండ్ల రాకేష్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో సోమవారం రాష్ట్ర సమావేశాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్, సాయి, లక్ష్మణ్, విజయ్, సమీర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నూతన జీపీలు ఏర్పాటు చేయాలి

బయ్యారం: మండలంలో ఆరు కొత్త గ్రామపంచాయతీలు ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య కలెక్టర్‌కు లేఖ రాశారు. పలు పంచాయతీల్లో కొనసాగుతున్న జగ్గతండా, చోక్లాతండా, సాంబతండా, వినోభానగర్, కోడిపుంజులతండా, గొల్లగూడెం గ్రామాలను పరిపాలన సౌలభ్యం కోసం పంచాయతీలుగా ఏర్పాటు చేయాలని కోరారు.

శ్రీరామ ఆలయంలో ధనుర్మాస పూజలు

మహబూబాబాద్ రూరల్: ధనుర్మాస వ్రత మహోత్సవ పూజల్లో భాగంగా పట్టణంలోని శ్రీరామ ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించగా భక్తులు తమ ఇళ్ల వద్ద నుంచి మంగళ హారతులు తీసుకునివచ్చి స్వామివారు, అమ్మవార్లకు సమర్పించారు.

సీసీ రోడ్డు పరిశీలన

కురవి: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌కు పక్కన ఉన్న ఇళ్ల వద్ద సీసీ రోడ్డును సోమవారం పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మి పరిశీలించారు.కొందరు వ్యక్తులు సీసీ రోడ్డును ఆక్రమించుకుని గదులు నిర్మాణం చేసుకున్నారని బండారి రమేశ్ అనే వ్యక్తి పలుమార్లు కలెక్టర్, తహసీల్దార్, ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేశాడు. దీంతో కార్యదర్శి పరిశీలించారు.

28నుంచి రాష్ట్ర మహాసభలు

డోర్నకల్: ఈనెల 28 నుంచి నల్లగొండలో జరిగే టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర మహాసభలకు సంబంధించిన ప్రచార పోస్టర్‌ను సోమవారం స్థానిక జెడ్పీహెచ్ఎస్‌లో హెచ్‌ఎం బండి నర్సింహారావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్, సంఘం మండల కార్యదర్శి శివప్రసాద్, శంకర్, శ్రీను పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమ్మె

మహబూబాబాద్: సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరవధిక సమ్మెకు విశ్రాంత ఉద్యోగులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు మైస నాగయ్య, నాయకులు వెంకటయ్య, నాగేందర్, సోమయ్య పాల్గొన్నారు.

చెరువు, కరకట్టలకు మరమ్మతులు చేపట్టాలి

మరిపెడ రూరల్: భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న చెరువు, కుంటల కరకట్టలు, పంట కాల్వలకు మరమ్మతులు తక్షణమే చేపట్టి యాసంగికి సాగు జలాలు అందించాలని సీపీఎం మండల కార్యదర్శి గుండగాని మధుసూదన్ డిమాండ్ చేశాడు. సోమవారం మండలంలోని తానంచర్ల, నీలికుర్తి, వీరారం, ఎడ్జెర్ల, ఉల్లెపల్లి గ్రామాల్లో రైతులతో కలిసి పర్యటించారు.

మంత్రి వ్యాఖ్యలపై నిరసన

గార్ల: బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్ షా తీరును నిరసిస్తూ సోమవారం గార్లలో సీపీఎం శ్రేణులు కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు శ్రీనివాసరావు, సత్యవతి, అంబటి వీరస్వామి, ఈశ్వర్‌లింగం పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే



గార్ల: గార్లలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే వేగవంతం చేయాలని పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్ సంబంధిత అధికారులకు సూచించారు. సోమవారం గార్లలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఆయన పరిశీలించారు. సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ అశోక్, భూక్యా నాగేశ్వరరావు, కార్యదర్శి అజ్మీర కిషన్ పాల్గొన్నారు.

మహాసభల వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

బయ్యారం: ఈనెల 28, 29, 30 తేదీల్లో నల్లగొండలో నిర్వహించనున్న టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సంఘం మండల అధ్యక్షుడు బాలునాయక్ అన్నారు. సోమవారం సభ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు భద్రునాయక్, భాస్కర్, సునీల్, తులసీదాస్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

మహబూబాబాద్ రూరల్: ట్రాక్టరును వెనుక నుంచి ఢీకొట్టిన ఘటనలో ఒకరికి గాయాలు కాగా కేసు నమోదు చేసినట్లు మహబూబాబాద్ రూరల్ ఎస్సై వి.దీపికరెడ్డి సోమవారం తెలిపారు. కేసు వివరాలు ఇలా ఉన్నాయి.. వరంగల్ రూరల్ జిల్లా ఖానాపురం మండలానికి చెందిన వీరమల్ల విజేందర్, తన కుటుంబ సభ్యులతో కలిసి ఈనెల 5వ తేదీన కురవి మండలంలో గల శ్రీవీరభద్రస్వామి దర్శనానికి ట్రాక్టరుపై వస్తున్నారు. ట్రాక్టరు జమాండ్లపల్లి గ్రామ శివారులో గల మున్నేరు వాగు సమీపంలోకి చేరుకోగానే వెనుక నుంచి బొలెరో వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విజేందర్ తల్లి వీరలక్ష్మికి గాయాలయ్యాయి. బాధితురాలి కుమారుడు విజేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు భద్రాది కొత్తగూడెంకు చెందిన గోపాల్ రావుపై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

భార్యాభర్తలకు తీవ్రగాయాలు

మహబూబాబాద్ రూరల్: రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు తీవ్రగాయాలైన సంఘటన మున్సిపాలిటీ పరిధిలోని జమాండ్లపల్లి గ్రామ శివారు అటవీ శాఖ అర్బన్ పార్కు సమీపంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. రూరల్ ఎస్సై వి.దీపికరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సికింద్రాబాద్ తండా గ్రామానికి చెందిన లింగాల లక్ష్మయ్య, రాధ దంపతులు జిల్లా కేంద్రానికి వచ్చి తిరిగి ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తున్నారు. వెనుక నుంచి వచ్చిన మరో ద్విచక్రవాహనదారుడు ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో లక్ష్మయ్య, రాధ దంపతులకు తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. లక్ష్మయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన సంద్రాలగూడెం గ్రామానికి చెందిన తోలెం వెంకన్నపై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

వరికోత మిషన్, పాల వ్యాన్ ఢీ.. డ్రైవర్‌కు తీవ్రగాయాలు

గార్ల: మండలంలోని సీతంపేట గ్రామ సమీపంలో సోమవారం తెల్లవారుజామున గార్ల నుంచి మహబూబాబాద్ వెళ్తున్న పాల వ్యాను ఆగి ఉన్న వరికోత మిషన్‌ను వెనుక నుంచి ఢీకొట్టడంతో పాల వ్యాను డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటనలో మహబూబాబాద్‌కు చెందిన పాలవ్యాను ముందు భాగం నుజ్జునుజ్జు అయింది. డ్రైవర్ తోట రమేశ్‌కు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని హుటాహుటిన 108 సహాయంతో మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స జరిపిస్తున్నట్లు సిబ్బంది రవికుమార్ తెలిపారు. కాగా వరికోత మిషన్ డ్రైవర్ పరారయ్యాడు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

గార్ల: పురుగుమందు తాగి ఓ వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన సోమవారం బుద్ధారం గ్రామంలో చోటుచేసుకుంది. గార్ల మండలం బుద్ధారం గ్రామానికి చెందిన మాధవి ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుమందు తాగింది. కుటుంబ సభ్యులు ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

మద్యం దుకాణంలో చోరీ

తొర్రూరు: మద్యం దుకాణంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన ఘటన ఆదివారం అర్ధరాత్రి డివిజన్ కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలోని భద్రకాళి వైన్స్‌లో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి రూ.2లక్షల విలువ చేసే మద్యం సీసాలు, రూ.20వేల నగదు దొంగిలించారు. ఈ దృశ్యాలు సీసీ కెమెరాల్లో నమోదయ్యాయి. ఈ ఘటనపై వైన్స్ నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేయగా క్లూస్ టీం సీసీ ఫుటేజీలను, వేలిముద్రలను పరిశీలించారు.

మోటార్ రాగి వైరు చోరీ

మహబూబాబాద్ రూరల్: మండలంలోని కేవుల తండా గ్రామంలో వ్యవసాయ బావికి అమర్చిన విద్యుత్ మోటారును గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి అందులో ఉన్న రాగి వైరును దొంగిలించారని కొలు రైతు ఓర్సు కుమారస్వామి సోమవారం తెలిపాడు. ఈ సంఘటనలపై పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ కనీసం పరిశీలనకు కూడా రాలేదని పేర్కొన్నాడు.

కాలనీ సమస్యలు పరిష్కరించాలి



మహబూబాబాద్: మంద కొమురమ్మనగర్ కాలనీ సమస్యలు పరిష్కరించాలని కాలనీ వ్యవస్థాపకుడు గుగ్గిళ్ల పీరయ్య ఆధ్వర్యంలో సోమవారం మున్సిపాలిటీ కార్యాలయంలో ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా పీరయ్య మాట్లాడుతూ.. పట్టాలు ఇవ్వడంతోపాటు ఇంటి నంబర్లు ఇచ్చారన్నారు. కనీస సౌకర్యాలు లేక కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్, రోడ్డు సమస్య పరిష్కారానికి ఎమ్మెల్సీ ఫండ్ నుంచి నిధులు కేటాయించాలని కోరగా ఎమ్మెల్సీ సానుకులంగా స్పందించి రూ.10లక్షలు ఇస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో ఎండి రజియా, రేణుక, పాషా, భిక్షపతి, సైదులు తదితరులు పాల్గొన్నారు.